100 రోజుల్లో థీమ్ పార్కు నిర్మించాం

- రూ.1.92 కోట్లతో సుందరంగా అభివృద్ధి
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


పీఎం పాలెం షిప్‌యార్డు లే అవుట్‌లో విద్యుత్ వెలుగుల్లో యోగా థీమ్ పార్కు

పీఎం పాలెం : జీవీఎంసీ ఆరో వార్డులోని పీఎం పాలెం షిప్‌యార్డు లే అవుట్‌లో యోగా థీమ్ పార్కును ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.1.92 కోట్లతో శంకుస్థాపన చేసిన 100 రోజుల్లోనే జీవీఎంసీ అధికారులు, సిబ్బంది పార్కు నిర్మాణం పూర్తి చేసి అద్భుతంగా తీర్చిదిద్దారని కొనియాడారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, జరిగిన అభివృద్ధి గత ప్రభుత్వాలు చేయలేదన్న వాస్తవం అందరూ గుర్తించాలని కోరారు. భీమిలి ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. జీవీఎంసీ 6వ వార్డు కార్పొరేటర్ లక్ష్మీప్రియాంక మాట్లాడుతూ వార్డులో స్పోర్ట్స్, యోగా థీమ్, బటర్ ఫ్లై పార్కులు నిర్మించడంతోపాటు రూ.150 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామని పేర్కొన్నారు. అనంతరం ఇంజినీరింగ్ అధికారులను ఎమ్మెల్యే శ్రీనివాసరావు సన్మానించారు. పార్కు పారంభ శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ తమ ప్రాంతంలో జరిగిన అభివృద్ధిపై హర్షం వ్యక్తం చేశారు. సీఎం జగన్ మోహన్ రెడ్డిని మరలా ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సిద్ధంగా వున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బొట్ట అప్పలరాజు, పోతిన ఎల్లాజీ, సూరిబాబు, కృష్ణమూర్తి పాత్రుడు, పోతిన ప్రసాద్, జామి శివకుమార్, కె.వరలక్ష్మి, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.


పార్కు ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు


పార్కులో వ్యాయామం కోసం ఏర్పాటు చేసిన పరికరాలు

పోలింగ్ బూత్‌ల వద్ద సౌకర్యాలు కల్పించాలి

సిబ్బందికి సీఈవో ముఖేష్ కుమార్ మీనా ఆదేశం


పెద్దిపాలెం పోలింగ్ బూత్‌లో సిబ్బందికి సూచనలిస్తున్న సీఈవో ముఖేష్ కుమార్ మీనా

ఆనందపురం : రానున్న సార్వత్రిక ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ చీఫ్ ఎలక్ట్రోల్ అధికారి ముఖేష్ కుమార్ మీనా సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని పెద్దిపాలెంలో ఏర్పాటు చేసిన 86, 87 పోలింగ్ బూత్‌లను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ బూత్‌ల వద్ద దివ్యాంగుల కోసం రెయిలింగ్, ర్యాంప్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. అలాగే మంచినీరు, విద్యుత్, వెలుతురు వంటి సౌకర్యాలు తప్పకుండా కల్పించాలన్నారు. సౌకర్యాలు కొరవడిన దగ్గర మూడు రోజుల్లో నూరు శాతం సౌకర్యాలు కల్పించాలని ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా పోలింగ్ బూత్ బీఎల్‌వోల వద్ద గల రిజిస్ట్రేషన్ వివరాలు అడిగి తెలుసుకుని, ఓటరు జాబితా పరిశీలించారు. ఆయనవెంట ఆర్డీవో భాస్కరరెడ్డి, తహసీల్దార్ హేమంత్ కుమార్, ఆర్‌ఐ మణికంఠ తదితరులు ఉన్నారు.

గెడ్డలు, పార్కుల రక్షణకు వినతి


గెడ్డ పరిరక్షణకు చర్యలు చేపట్టాలని మధురవాడ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న స్థానికులు


వినతులు స్వీకరిస్తున్న భీమిలి జెడ్సీ శైలజవల్లి

మధురవాడ: గెడ్డలు, పార్కుల పరిరక్షణ కోసం ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోతోందని, ఇప్పటికైనా ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని పలువురు కోరారు. జీవీఎంసీ మధురవాడ జోన్ – 2 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శాంతిరాజు, సూపరింటెండెంట్ అప్పలరాజు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జోన్‌లోని 5 నుంచి 13 వరకు గల వార్డుల్లోని వివిధ ప్రాంతాల నుంచి పలు సమస్యలపై 15 అర్జీలు వచ్చాయి. మిథిలాపురి వుడా కాలనీ ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూలు ప్రాంగణం లోనుంచి ప్రవహిస్తున్న గెడ్డ దిశను కొందరు మార్చివేయడమే కాకుండా పూర్తిగా కప్పేస్తున్నారని, దీనిపై 2015 నుంచి ఫిర్యాదు చేస్తున్నా ప్రయోజనం లేకపోతోందని వాపోయారు. మురుగు నీరు నిల్వ ఉండిపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారని ప్రిన్సిపాల్ ఫ్రాన్సిస్ ఈఎమ్ సిబీ ఆవేదన వ్యక్తం చేశారు. బింద్రానగర్ – పిలకవాని పాలెం – ఎస్‌ఎఫ్ స్కూలు మీదుగా శివాలయం వరకు ప్రవహించే గెడ్డ సమస్య పరిష్కరించాలని బింద్రానగర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, ఎస్.ప్రసాద్ తదితరులు కోరారు. పీఎం పాలెం ఎంఐజీ – 320 మొదటి బస్టాప్ వద్ద పడిపోవడానికి సిద్ధంగా ఉన్న కానుగ చెట్లు తొలగించాలని పి.సుజాత మూర్తి కోరారు. స్పందనలో వచ్చిన అర్జీల పరిష్కారానికి జోనల్ కమిషనర్ ద్వారా చర్యలు చేపడతామని సూపరింటెండెంట్ అప్పలరాజు హామీ ఇచ్చారు.

భీమునిపట్నం: స్థానిక జోనల్ కార్యాలయం వద్ద జెడ్సీ శైలజవల్లి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 'స్పందన'కు ఏడు వినతులు వచ్చాయి. రెవెన్యూ విభాగానికి మూడు, ప్రజారోగ్యం, ఇంజినీరింగ్ విభాగాలకు రెండేసి చొప్పున నాలుగు వినతులు వచ్చాయి. వీటిని పరిశీలించి పరిష్కరిస్తామని జెడ్సీ తెలిపారు.

క్లుప్తంగా

శ్రీనివాసరెడ్డికి ఏషియన్ ఐకానిక్ అవార్డు


నటుడు సోనూసూద్ నుంచి అవార్డు తీసుకుంటున్న శ్రీనివాసరెడ్డి

తగరపువలస : స్థానిక వెంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వెంపాడ శ్రీనివాసరెడ్డికి ముంబయిలోని అంధేరి వెస్ట్ ముక్తి కల్చరల్ క్లబ్‌లో రామ్‌కుమార్‌పాల్ – 64 ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఏషియన్ ఐకానిక్ అవార్డు – 2024 అందజేశారు. సామాజిక సేవకులకు ఇచ్చే ఈ అవార్డును ప్రముఖ నటుడు సోనూసూద్ చేతుల మీదుగా ఫౌండేషన్ అందించింది. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఏడాది పొడవునా సేవా కార్యక్రమాలు చేస్తున్న తనతోపాటు తోటి మిత్రులకు అందిన ఈ అవార్డు గౌరవ నీయమైనదన్నారు.

పాఠశాలకు ఫ్యాన్లు అందజేత


ఉపాధ్యాయులకు ఫ్యాన్లు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ఆనందపురం : ఆనందపురం ఉన్నత పాఠశాలలో 2000 – 2001 విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులు సోమవారం పాఠశాలకు ఫ్యాన్లు అందజేశారు. పూర్వ విద్యార్థులు పాఠశాలలో సమావేశమై పలు విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా 20 సీలింగ్ ఫ్యాన్లు అందజేయడంతోపాటు పరుగు పందెంలో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్న విద్యార్థి బి.శైలజకు రూ.2 వేలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు రామకృష్ణ పట్నాయిక్, సత్యనారాయణ, ఖేజియా తదితరులు పాల్గొన్నారు.

14న అక్షరాభ్యాసాలు

కొమ్మాది: శ్రీ అష్టలక్ష్మి దేవాలయంలో ఈ నెల 14న బుధవారం శ్రీ పంచమి మహాపర్వదినాన్ని పురస్కరించుకుని విద్యాలక్ష్మి అమ్మవారికి విశేష పూజలు, చిన్నారులచే సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించనున్నామని ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధర స్వామి తెలిపారు. ఏటా ఈ మాఘమాసంలో వచ్చే శ్రీ పంచమి నాడు చిన్నారులకు అక్షరాభ్యాసం జరిపితే అఖండిత విద్యాప్రాప్తి కలుగుతుందని తెలిపారు. అక్షరాభ్యాసం చేయించుకోవాలనుకునే వారు ముందుగా ఆలయంలో సంప్రదించాలని తెలిపారు.

'చిన్నయ్య కుటుంబం అప్పులు రద్దు చేయాలి'


చిన్నయ్య భార్య, కుమార్తెలను పరామర్శిస్తున్న కార్పొరేటర్ గంగారావు

పద్మనాభం : కోవిడ్ కారణంగా అప్పులపాలై ఆత్మహత్య చేసుకున్న ఏనుగులపాలెం నివాసి కొమ్మారు చిన్నయ్య అప్పులు రద్దు చేసి వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు కోరారు. సోమవారం ఆయన ఏనుగులపాలెంలో చిన్నయ్య భార్య మంగమ్మ, కుమార్తెలు అనుప్రియ, మానసను పరామర్శించారు. ప్రభుత్వం తరఫున ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, అధికారులు ఆ కుటుంబాన్ని పరామర్శించి ఆదుకోవాలని కోరారు. ఆత్మహత్యకు దారి తీసిన పరిస్థితులు అడిగి తెలుసుకుని, వారి కుటుంబానికి సీపీఎం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కుమార్తెల చదువు ఖర్చులు ప్రభుత్వమే భరించాలని కోరారు.

యునాని వైద్యంతో సత్ఫలితాలు


రోగుల సమస్యలు తెలుసుకుంటున్న వైద్యురాలు ప్రతిభ

భీమునిపట్నం: యునాని వైద్యంతో ఎన్నో రోగాలు నయమవుతూ మంచి ఫలితాలు వస్తాయని ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ ప్రతిభ అన్నారు. యునాని వైద్యం ప్రవేశపెట్టిన హకీం అజ్మల్ ఖాన్ జయంతి సందర్భంగా సోమవారం ఎగువపేటలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశీయ వైద్యంలో ప్రత్యేక గుర్తింపు ఉందని, సాధారణ రోగాలతోపాటు దీర్ఘకాలిక రోగాలకు కూడా మంచి మందులు ఉన్నాయని చెప్పారు. అనంతరం రోగుల సమస్యలు తెలుసుకుని అవసరమైన మందులు అందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రి ప్రధాన వైద్యులు డాక్టర్ ప్రదీప్‌కుమార్, కార్పొరేటర్ గంటా అప్పలకొండ, వైఎస్సార్‌సీపీ 3వ వార్డు అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగరావు, నాయకులు మైలపల్లి లక్ష్మణరావు, కదిరి ఎల్లాజీ, సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

నేవీలో అపార అవకాశాలు


మాట్లాడుతున్న లక్ష్మీ బదనా

కొమ్మాది: నేవీలో అపార అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని లెఫ్టినెంట్ లక్ష్మీ బదనా అన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో సోమవారం నేవీ యంగ్ ఆఫీసర్స్‌తో విద్యార్థుల ఇంటరాక్ట్ కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. ప్రతీ విద్యార్థి దేశ సేవ చేయడానికి ముందుకు రావాలని, నేవీలో అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు.

విద్యార్థులకు వైద్య సేవలు


విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యురాలు వైడీ కల్యాణి

తగరపువలస : భీమిలి మండలం పెదనాగమయ్యపాలెంలో సోమవారం దివీస్ లేబొరేటరీ ఆధ్వర్యంలో 125 మంది విద్యార్థులకు భీమిలి ప్రభుత్వ వైద్యురాలు వైడీ కల్యాణి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమెతోపాటు ఎంఈవో ఎం.శివరాణి ఆరోగ్య సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డు దుర్గారావు, తోట ఎల్లారావు, ప్రధానోపాధ్యాయుడు రమణ, ఉపాధ్యాయులు విమల, స్వాతి, దివీస్ ప్రతినిధులు ఎ.శ్రీనివాస్, కె.నరసింహ, పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో ఉన్నత శిఖరాలకు చేరాలి


పాత్‌వే ప్రారంభిస్తున్న సీజీఎస్‌టీ కస్టమ్స్ చీఫ్ కమిషనర్ సంజయ్‌పంత్

కొమ్మాది: ఆత్మవిశ్వాసంతో అంధ విద్యార్థినులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సీజీఎస్‌టీ కస్టమ్స్ చీఫ్ కమిషనర్ సంజయ్‌పంత్ సూచించారు. సాగర్ నగర్ సమీపంలో గల అంధ బాలికల ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో పాత్‌వే (నడక మార్గం)ను సోమవారం ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సీజీఎస్‌టీ డిపార్టుమెంట్ రూ.3.50 లక్షలతో పాఠశాలలో పాత్‌వేను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ తిరుమల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ చైర్మన్ అప్పలరాజు, తదితరులు

తగరపువలస : సాయి సంహిత ఫౌండేషన్ మూడో వార్షికోత్సవం సందర్భంగా ఆ సంస్థ చైర్మన్ రెడ్డిపల్లి అప్పలరాజు బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో సోమవారం సేవా కార్యక్రమాలు చేపట్టారు. 100 మంది వృద్ధులకు దుప్పట్లు, విద్యార్థులకు స్టేషనరీ, వాటర్ బాటిళ్లు, తినుబండారాల కోసం రూ.10 వేలు ఖర్చు చేశారు.

నిరుద్యోగులకు పరీక్షల మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రెడ్డిపల్లి సన్యాసిరావు, ఆదిలక్ష్మి, మద్దిరెడ్డి సంతోషికుమారి, సాయి ప్రణీత, జ్ఞాన సంహిత, ఉపాధ్యాయులు స్నిగ్ధ, రమ, వజీద, బషీర, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గెడ్డల కలుషితంపై 'స్పందన'లో ఫిర్యాదు


కలెక్టరేట్ 'స్పందన'లో ఫిర్యాదు చేసిన వలందపేట వాసులు

తగరపువలస : భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీ, జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు పరిధిలోని గోస్తనీనది గెడ్డల్లోకి సంగివలస శశి విద్యాసంస్థలు విడుదల చేస్తున్న మురుగునీరు కారణంగా ఈ ప్రాంతాలు కలుషితమవుతున్నాయని వలందపేట వాసులు సోమవారం వేర్వేరుగా కలెక్టరేట్‌లోని స్పందనలో ఫిర్యాదు చేశారు. సరగడ కనక వెంకట సూరిబాబు, తోణంగి అప్పయ్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం... శశి విద్యా సంస్థలు శుద్ధి చేయకుండా వదిలిన మురుగునీరు గెడ్డలో కలవడంతో ఆ నీరు తాగుతున్న పశువులు అనారోగ్యాలకు గురవడమే కాకుండా బోరుబావులు కూడా కలుషితం అవుతున్నాయన్నారు. గెడ్డలు కలుషితం కావడం వల్ల సంగివలస, వలందపేట రజకులు దుస్తులు శుభ్రం చేసుకోలేక ఇబ్బంది పడుతున్నారన్నారు. గతంలో శశి యాజమాన్యం రెండేళ్లలో సమస్య పరిష్కరిస్తామని చెప్పి మూడేళ్లు కాలయాపన చేసిందన్నారు. సంగివలస సర్వే నంబర్ 25/6లో 70 సెంట్లు జిరాయితీ స్థలంలో 8 అడుగుల రహదారి దుర్గాలమ్మ ఆలయ భక్తులకు కేటాయించగా అందులో దౌర్జన్యంగా డ్రైనేజీ తీశారని ఆరోపించారు.

- తాటితూరు పంచాయతీ సర్వే నంబర్ 289/3లో 6.42 ఎకరాల పచ్చికబయలుకు తూర్పున ఒక ఎకరం భూమిలో శ్మశానవాటిక నిర్వహిస్తుండగా మిగిలిన భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేశారన్నారు. దీనిని సర్వే చేయించి స్వాధీనం చేసుకోవాలని కోరారు. దీనిపై 2019 నవంబరులో సిట్‌లో కూడా ఫిర్యాదు చేశామన్నారు. అలాగే ఇక్కడ 0.40 సెంట్ల విస్తీర్ణంలో ఇసుక అక్రమ తవ్వకాలు కూడా జరుగుతున్నాయన్నారు. చిల్ల సూర్యనారాయణ రెడ్డి, వంక ఎర్రయ్య, చిల్ల సూరిదాసు, కొసన శ్రీనివాస రెడ్డి తదితరులు ఫిర్యాదు చేశారు.

సంక్షేమం, అభివృద్ధికి చిరునామా సీఎం జగన్


కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


లబ్ధిదారుకు పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తదితరులు

ఆనందపురం : పేదల బతుకులను బాగు చేయడానికి అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తూ ముందుకు సాగుతున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధి పథకాలకు చిరునామాగా నిలిచారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బంటుబిల్లివారి కళ్లాలులో సోమవారం 82 మంది వైఎస్సార్ జగనన్న కాలనీ లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గంగిగోవు లాంటిదని, దాన్ని నమ్ముకుంటే నిరంతరం లబ్ధి పొందుతూనే ఉంటారని చెప్పారు. టీడీపీ వట్టిపోయిన ఆవు లాంటిదని, ఎంత ఎదురు చూసినా ఫలితం మాత్రం దక్కదన్నారు. సినిమాలు వేరు, రాజకీయం వేరని... కులం ముసుగులో వస్తున్న వారిని ఆదరిస్తే చాలా నష్టపోతామన్నారు. కులం కూడు పెట్టదని, ప్రజలు విజ్ఞతతో వ్యవహరించి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని బలపరచాలని కోరారు. రాష్ట్రాన్ని చాలా మంది పరిపాలించారని, కానీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం చేస్తున్న మంచిని గుర్తించి మరలా ఆయననే ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. దానివల్ల సమాజంలో గల అన్ని వర్గాల వారికి మరింత మేలు జరుగుతుందని వివరించారు. కుల మతాలకు అతీతంగా, అవినీతి లేకుండా సంక్షేమ పథకాలు అమలు పరిచిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. కాలనీల పేరుతో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారని కొన్ని పచ్చ పత్రికలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, పేదల ఇళ్ల కోసం స్థలాలు చదును చేయడం తప్పా అని ఆయన ప్రశ్నించారు. 20 ఏళ్లుగా ఉన్న ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించి లబ్ధిదారులకు పట్టాలు అందజేయడంలో స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, కోన శ్రీను తదితరుల కృషి ఎంతో ఉందన్నారు. ఈ సందర్భంగా ఇళ్ల పట్టాల పంపిణీతోపాటు రూ.53.40 లక్షలతో ఏర్పాటు చేయనున్న జల జీవన్ మిషన్ పథకానికి శంకుస్థాపన, గ్రామంలో రోడ్లు, కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ హేమంత్ కుమార్, ఎంపీడీవో నీలం అప్పలనాయుడు, సర్పంచ్ కోన పైడిరాజు, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, ఎంపీటీసీ సభ్యురాలు కోరాడ సూర్య కుమారి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, భీమిలి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, నాయకులు కోరాడ అప్పలస్వామి నాయుడు, కోరాడ రాంబాబు, బీఆర్‌బీ నాయుడు, బొట్టా రామకృష్ణ, పిన్నింటి వెంకట రమణ, గంద్రేటి సూర్యనారాయణ, చందక అప్పలరాజు, పడాల రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రజా రవాణాతో పర్యావరణ పరిరక్షణ


ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి చేరుకుంటున్న మేయర్ హరి వెంకటకుమారి

దాబాగార్డెన్స్: వారంలో ఒక్కరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని మేయర్ గొలగాని హరివెంకటకుమారి పేర్కొన్నారు. ఆమె తమ క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. అనంతరం తన చాంబర్‌లో నిర్వహించిన డయల్ యువర్ మేయర్, ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం(గ్రీవెన్స్)కు హాజరయ్యారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై వచ్చారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఎకో–వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో నగరంలో పర్యావరణ పరిరక్షణకు జీవీఎంసీ అనేక చర్యలు చేపడుతుందన్నారు. ఇందుకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే పూజ నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. వివరాలకు 0891 271 1725, 2566514లో సంప్రదించాలి.

వెటర్నరీ అధికారి భాగ్యలక్ష్మికి నివాళి

తగరపువలస : ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన వెటర్నరీ అధికారి భాగ్యలక్ష్మికి పాలకొండకు చెందిన లార్డ్ వెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు సోమవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంస్మరణ సభలో పూర్వ విద్యార్థులు ఆమెతో గల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రఘుపతి, ప్రధానోపాధ్యాయురాలు గౌరి, కశింకోట ఎంపీడీవో కె.శేషుబాబు, శ్రీకాకుళం పీఆర్ డీఈ రాధారాణి, సీతంపేట ప్రాంతీయ ఆస్పత్రి వైద్యురాలు ఉష, పద్మనాభం మండల సూపరింటెండెంట్ పోలుబోతు రాధ, జీవీఎంసీ ఏఈ మహేష్, ప్రధానోపాధ్యాయురాలు చిన్నమ్మలు, కాశీప్రసాద్, ఎస్‌బీఐ మేనేజర్ జువ్వాది రవి, ఎల్‌ఐసీ మేనేజర్ రాధాకృష్ణ, పోర్ట్ ట్రస్ట్ అధికారి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం


తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను విశేషంగా అలంకరించి అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.అర్చకుడు రఘునాథ్ తదితరులు ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.